# విముక్తి

రంగన్న జైలునుంచి విడుదలయ్యాడు. తన మూట ముల్లె బుజానవేసు కుని జైలు రహదారి గుమ్మందాటి బయటపడ్డాడు. హాయిగా శ్వాస పీల్చాడు. ఎంతో ఆనందం పొందాడు.

నాల్గు సంవత్సరాల తర్వాత తిరిగి తాను పదిమందిలో తిరిగే అవ కాశం లభించింది. వీధిలోకి రాగానే చెట్లు తమ కొమ్మల వింజామరాల్తో రంగన్నకు విసిరాయి అతను ఉత్సాహంగా నడిచాడు. ఉదయం పది గంటలు... దూరాన ప్రతి పెద్ద బిల్డింగుపైన దేశం త్రివర్ణ పతాకం ఎగురుతోంది. నడుస్తూంటే స్కూలు ఆవరణలో పిల్లలు ఆటలాడు తున్నారు... మరోచోట జాతీయ గీతాలు ఆలపిస్తున్నారు... ఇంకోచోట ఎవరో ఒక నాయకుడు ఉపన్యసిస్తున్నాడు.... మరికొందరు కూలీలు లారీలలో ఊరేగుతూ "స్వాతంత్ర్యం మా జన్మహక్కు" వందేమాతరం నినాదాలతో కేకలేస్తున్నారు... ఇవన్నీ రంగన్న చూశాడు...దారినపోయే ఒకణ్ణి అడిగాడు .. ఎందుకు బాబూ యీ సంబరం— అని... ఈవేళ ఆగస్టు పదిహేను.... జవాబు— అప్పటికర్థమయింది రంగన్నకు, దేశా నికి స్వాతంత్ర్యం వచ్చినరోజు యిదే అని.

సరిగ్గా తనకుకూడా యీనాడు నిజంగా స్వాతంత్ర్యం వచ్చినట్లు భావించాడు రంగన్న. నాల్గు సంవత్సరాల క్రితం— రాత్రి పదిగంటలకు

ఒక ఆసామీ యింట్లో కన్నం వేశాడు... ఎందుకు... యింట్లో భార్య ప్రసవవేదనతో బాధపడుతోంది... యిద్దరి పిల్లలకు జ్వరాలు .. ఒక వంద రూపాయిలు అప్పుయిమ్మని ప్రాధేయపడితే ఆ ఆసామీ నిరాకరించాడు... పది సంవత్సరాలుగా పనిచేసే తనకే అప్పు యివ్వకపోతే ఇంక ఎవరిని యితను ఉద్ధరిస్తాడు... భార్య ప్రసవించింది... చావు బ్రతుకుల మీద ఉంది... రాత్రి అదే ఆసామీ యింట్లో చోరీచేశాడు...... నగలు, రూపాయలు దొంగిలించివస్తోంటే... వీధి కాంపౌండులో పడుకున్న ఆసామీ మెలకువ తెచ్చుకుని అరిచాడు... ఒకే గిరవాటు... కత్తి ...... గుండెల్లో కసిక్కుని గుచ్చుకొంది... అసలే భయస్థుడా ఆసామీ... అంతటితో ప్రాణాలు విడిచాడు... తర్వాత దర్యాప్తు జరిగింది... తాను పట్టుబడ్డాడు... జైలువాసం లభించింది... కాని భార్యకు మందిప్పించాడు... పిల్లలకు జ్వరం తగ్గింది... పట్టుబడినప్పుడు పోలీసులు తీసుకుపోతూంటే భార్య కంటతడి చూశాడు... కాని ఏంచేయగలడు ? వారికి ఆధారం ? ఎలా వున్నారో... పరిపరివిధాల మనస్సుపోయింది రంగన్నకు.

ఈ పట్టణానికి నలభై మైళ్ళ దూరంలోవుంది తన ఊరు. కాని చేతిలో పైసలేదు. యింటికి ఎలా వెళ్ళాలి...? అనే ఆలోచనలు ఎన్నో మెదడులో కదిలాయి రంగన్నకు.

బజారులో అడుగుపెట్టేడు. ఎక్కడైనా కూలిచేసుకుందామని. బజారు ఆరోజు మూసేశారు. ఏంతోచక అటూయిటూ తిరగడం మొదలెట్టేడు రంగన్న.

ఒకచోట సభ జరుగుతోంది... ఉపన్యాసాలు ధారాప్రవాహంగా వినవస్తున్నాయి.... దేశం నాయకత్వం వహించిన పెద్దలను పొగడుతున్నారు. "మన స్వాతంత్ర్య రక్షణకు యీనాడు దీక్ష వహించాలి... ప్రక్కలో బల్లెంలా పొంచివుంది శత్రువు... మీరేమిస్తారు ఎంతైనా

దేశరక్షణకు విలువైనదే " నాయకుడి ఉపన్యాసం ప్రజల్లో సంచలనం కలిగించింది... ఉంగరాలు... బంగారు గాజులు, ధనం .. ఒక్కొక్కటే నాయకుని చేతుల్లో రాలాయి... మందహాసంతో స్వీకరించాడు ఆయన... దేశరక్షణ నిధి—

రంగన్న ఒక్కసారి స్థితిగతుల పర్యాలోకన చేశాడు. నాల్గు సంవత్సరాల క్రితం ప్రతివాడూ తనకు దొరికినది కూడబెట్టుకుందామన్న ధ్యాసే... కాని నేడు ఉన్నది త్యాగంచేసి దేశాన్ని రక్షించాలన్న ఆకాంక్ష ప్రతీవానిలో ఉన్నట్లు కనిపించింది .. అందరూ తమకు మిగిలిన ధనం, ఆస్తి, దేశరక్షణకు యిచ్చేస్తే దొంగతనానికి ఆస్కారం ఏదీ? రంగన్న తనలోతాను తర్కించుకున్నాడు... అసలు అనవసరంగా డబ్బు దాచుకోవడం వల్లనే, దోపిడులు, కొట్లాటలు, హత్యలు జరుగుతున్నాయని ఊహించాడు రంగన్న... ఇకముందు దేశం పరిస్థితులు మారుతాయి... మారుతున్నాయి... తనకు మునుపు జరిగిన పరిస్థితి తిరిగిరాదు...సంతోషించాడు రంగన్న...

పట్టణంలో మిలిటరీవాళ్ళు ఏదో పనిమీద తిరుగుతున్నారు... వాళ్ళు మామూలుగా నడిచినా వినిపించే టకటక బూట్ల శబ్దాలు రంగన్నని ఉత్సాహపరిచాయి... సైన్యంలో చేరిపోతే... .. కాని యీ వయసులో తన్ను తీసుకుంటారా? తన్నుతానే ప్రశ్నించుకున్నాడు రంగన్న.

ఒక హోటలునుంచి రేడియో వినిపిస్తోంది... "చైనా దొంగ పన్నాలు- అసలు చైనాను ఐక్యరాజ్య సమితిలో చేర్చడానికి ప్రయత్నించిందెవరు ? అటువంటి స్నేహితుణ్నే వెన్నుపోటు పొడిచింది..." ఈ మాటలు రంగన్న చెవుల్లో గింగురుమన్నాయి... ఒకప్పుడు బ్రిటిషువారి క్రింద బానిసత్వాన్ని రూపుమాపడానికి దేశంలో విప్లవంరేగింది....ఇంక పప్పులుడకవనుకొన్న బ్రిటిష్‌వారు సౌమ్యంగా స్వాతంత్ర్యం యిచ్చి

గౌరవించారు... యీనాడు మన స్వేచ్ఛ దొంగిలించాలనుకున్నది నియంతృత్వ చైనా...రంగన్నకు ఆవేశం కలిగింది... జైలులో వున్నప్పుడు తోటివాళ్ళు చెబుతూండేవారు... చైనా మనపై దండెత్తుతోందని... రంగన్నకు ఏదో ఆవేశం కలిగింది... మనలో మనం కొట్లాటలు, దొంగతనాలు చేసుకోడంఎందుకు? మనజాతి విచ్ఛిత్తికి కారణం కాదూ?...లోలోపల రంగన్న మథనపడ్డాడు... తనకే ఆర్థిక దుస్థితి లేకపోతే... అలా దొంగతనం... హత్య చేసివుండేవాడు కాదు... అనుకున్నాడు రంగన్న.

ఎదురుగా హోటలులోకి ప్రవేశించాడు... ప్రొప్రయిటరు వీభూది పిండి కట్లతో శ్రోత్రియంగా కూర్చుని మడిగా డబ్బులు గళ్ళాపెట్టెలో వేసుకుంటున్నాడు...

"బాబూ ఏదైనా చిన్నపని యిప్పిస్తారా!

"ఏం పని కావాలోయి... సర్వరుపని చేస్తావూ?... రోజుకు ముప్పావలా... భోజనం ఉచితం..."

"అలాగే బాబూ..."

ఉద్యోగంలో చేరాడు రంగన్న, హోటల్లో. పెద్దవాళ్ళకు టిఫినులు అందిచ్చే టప్పుడు వాళ్ళతో పరిచయం చేసుకోవా లనుకున్నాడు కాని వాళ్లు యితనితో చనువుగా ఎందుకు మాట్లాడతారు...? జాతిలో ఇంకా హెచ్చు తగ్గు తారతమ్యాలు ఉన్నాయిగా... యివి ఎప్పుడు నశిస్తాయో పర దేశం కబళిస్తే?... పూర్తిగా దాస్య శృంఖలాలే?... మళ్ళీ ఉలిక్కి-పడ్డాడు రంగన్న...

ఆరోజురాత్రి... వూరంతా దీపావళిలా... బాణసంచా కాల్చారు. యిళ్ళకు, ప్రభుత్వ బంగళాలకు విద్యుద్దీపాల తోరణాలు కట్టారు... రాత్రి హోటలు పని ముగించుకుని వీధిలో పచారు ప్రారంభించాడు

రంగన్న... నాల్గు రోజులు పనిచేసి, కొంతడబ్బు సేకరించుకుని యింటికి వెళ్ళిరావా లనుకున్నాడు రంగన్న...

వారం రోజులు గడిచాయి... వానలు జోరుగా కురుస్తున్నాయి... యించుమించు ముసురు పట్టినట్లే... అయిదవరోజు కొ ం త తె రి పి యిచ్చింది... రంగన్న హోటలు యజమానితో అన్నాడు... రెండు రోజులు స్వంత ఊరు వెళ్ళివస్తానని... యజమాని విసుక్కున్నాడు... చివరకు జీతం లేకుండా సెలవుయిస్తా పొమ్మన్నాడు .

వారంరోజులబత్తెం జాగ్రత్తపెట్టుకుని ..బస్సుఎక్కాడురంగన్న.

బ స్సు వే గ ం గా నడిచింది... చుట్టూ వానలకు- పిల్లకాల్వలు వేగంగా పారుతున్నాయి... రోడ్లు గతుకులతో మురికితో... తడితడిగా వుంది...... యింటికి వెళ్ళగానే. భార్యాపిల్లలు... తనకు స్వాగతం యిస్తారు... ఆ ఏరుప్రక్కన గుడిసెలో వుంటున్న తనభార్య ఎలా బ్రతుకుతూందో యిన్నాళ్ళు ..? బహుశా ఎవరింట్లోనైనా దాసీపని చేస్తుండ వచ్చుననుకున్నాడు రంగన్న...

బస్సుదిగాడు రంగన్న తనఊరి పొలిమేరలో... వ డి వ డి గా యింటివైపు నడిచాడు... ఎదురుగా కనిపించే జొన్నచేలు నిండా నీరు తొణుకుతోంది... చెట్లు కూలిఉన్నాయి అక్కడక్కడ ... రోడ్డంతా బురద... తిన్నగా గుడిసెచేరాడు... ఏరువార...కాని గుడిసెకూలిఉంది చుట్టూ బురద...దూరంగా చెట్టుక్రింద పక్షుల్లా కొంతమంది జనం ... అందులోంచి వీరయ్యవచ్చాడు...రంగన్నను గుర్తుపట్టాడు...

'ఏరా! రంగన్నా! యిదేనా రావడం...'

'అవును...'

'పాపం... దురదృష్టవంతుడివి___' వీరయ్య పెదిమవిరిచాడు...

రంగన్నకు ఎడంకన్నుఅదిరింది.

'నాల్గురోజులక్రింద ఏరు పొంగింది... ఓరాత్రి...నీ భార్యా... పిల్ల... అప్పటినుంచి కనిపించటంలేదు... కొట్టుకు పోయారేమో ... వీరయ్య జాలిచూపాడు...చుట్టూ జనంమూగారు... రంగన్న నిర్విణ్ణుడై పోయాడు ఒక క్షణం...

'రెండు సంవత్సరాలక్రితం నీ మొదటిపాప చచ్చిపోయింది...'

రంగయ్యకు అంతా శూన్యంలా గోచరించింది. దుఃఖం ఆపుకోలేక తుండుగుడ్డతో తుడుచుకున్నాడు...ఆ ఏటిఒడ్డున బురదలో ఒంటిగా ఎంతసేపు నడిచాడో అతడికే తెలియలేదు... సాయంత్రం పడింది... తిరిగితిరిగి బస్సుస్టాండుచేరాడు...బస్సుస్టాండువద్ద... రాత్రిచీకటిలో... ఒంటిగా ఏడుస్తూకూర్చున్నాడు... మర్నాడు ఉదయం వచ్చిన బస్సు ఎక్కాడు. తాను ఏంచేయాలి?...ప్రశ్నించుకున్నాడు...

ఆగస్టు పదిహేనునాడు విన్న సంగతులు చూసినదృశ్యాలు...కళ్ళ ముందు తిరిగాయి...ఎవరూలేని తను...జీవితం సార్థకంగాగడపాలి... ఏంచేయాలి...

బస్సుదిగి హోటలువైపు నడిచాడు...సగందూరంవచ్చాక మరోదారి పట్టాడు...తిన్నగా రిక్రూటింగు ఆఫీసు దగ్గరికి పోయాడు...సాయంత్రం నాలుగంటలకు తన్నుపిలిచారు...ఒళ్ళు కొలిచారు... మాట్లాడారు ... సైన్యంలో చేర్చుకున్నామన్నారు...

రంగన్నకు సంతృప్తికలిగింది...

ఆనందబాష్పాలు రాల్చాడు...

వీధిలోంచి ఒక ఊరేగింపు నడిచింది...

నినాదాలు రేగేయి...

'దేశ స్వాతంత్ర్యం రక్షించుకోండి దేశ రక్షణనిధికి విరాళాలివ్వండి'

రంగన్న తిన్నగా ఊరేగింపువైపు నడిచాడు...చేతిలో ఉన్న ఒక రూపాయి ఆ ఊరేగింపు డబ్బీలోవేశాడు...

హాయిగా నవ్వాడు రంగన్న, దుఃఖం మరచి. ★